ఆంక్షలపై పునరాలోచించాలి

ప్రధాని మోదీ, ఆర్బీఐకి స్టార్టప్‌ల లేఖ

-:పేటీఎం సంక్షోభం:-

ఇతర పేమెంట్ యాప్‌లకు గిరాకీ

పేటీఎం సంక్షోభం నేపథ్యంలో పెద్ద ఎత్తున దాని ప్రత్యర్థి సంస్థల యాప్‌లు డౌన్‌లోడ్ అవుతున్నాయి. పేటీఎం యూజర్లు ఇతర పేమెంట్స్ యాప్‌ల వైపు చూస్తుండటమే ఇందుకు కారణం. దీంతో ఫోన్‌పే, గూగుల్ పే, భీమ్ యూపీఐ యాప్‌లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. కేవలం నాలుగు రోజుల్లో 10 లక్షలకుపైగా డౌన్‌లోడ్స్ జరిగినట్టు మార్కెట్ గణాంకాల నుబట్టి తెలుస్తున్నది. క్రితంతో పోల్చితే ఇది సుమారు 50 శాతం అధికమని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పేటీఎంకు మద్దతుగా పదికిపైగా స్టార్టప్‌లు కదిలాయి. పేటీఎం అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఇటీవలి ఆంక్షలు సరికాదని, పునరాలోచించాలని కోరుతూ అటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు దాదాపు డజను స్టార్టప్‌ల వ్యవస్థాపకులు లేఖ రాశారు. 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ తీసుకున్న చర్యలు, పెట్టిన ఆంక్షలు యావత్తు ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్‌ను కలవరపర్చేలా ఉన్నాయి. దీనిపై ఫిన్‌టెక్ కంపెనీలతో నిర్మాణాత్మక చర్చలు జరుపాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని సదరు లేఖలో స్టార్టప్ ఫౌండర్లు పేర్కొన్నారు. దీనిపై అంతా సంతకాలు కూడా చేశారు. వీరిలో రాజేశ్ మ్యాగో (మేక్‌మైట్రిప్), మురుగవేల్ జానకిరామన్ (భారత్ మ్యాట్రిమొని), దీపక్ షెనాయ్ (క్యాపిటల్‌మైండ్) తదితరులున్నారు. పేటీఎంపై ఆర్బీఐ తీరు.. భారత్‌కున్న వ్యాపార అనుకూల ముద్రను దెబ్బతీసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు పనిగట్టుకుని ఆర్బీఐతో గొడవలకు దిగడం సరికాదన్న భావన కూడా స్టార్టప్‌ల్లో కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ లేఖపట్ల ఫిన్‌టెక్ స్టార్టప్‌ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని తెలుస్తున్నది. నిబంధనల్ని ఉల్లంఘించిందని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ కొరడా ఝుళిపించిన విషయం తెలిసిందే. ఈ నెల 29 తర్వాత కస్టమర్ ఖాతాలు, డిజిటల్ వ్యాలెట్లలో ఏ రకమైన డిపాజిట్లను అంగీకరించవద్దని ఆంక్షలు పెట్టిన సంగతీ విదితమే. వచ్చే నెల ఆరంభంలో బ్యాంక్ లైసెన్స్‌నూ రద్దు చేస్తారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దీంతో స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో ఒక్కసారిగా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అంతేగాక పేటీఎం షేర్లపైనా ఈ ప్రభావం కనిపిస్తున్నది. 2 కోట్ల వ్యాపారులు, 30 కోట్ల కస్టమర్లూ అయోమయంలో పడ్డారు. 2009లో పేటీఎంను విజయ్ శేఖర్ శర్మ స్థాపించారు. 2015లో పేటీఎంకు పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ వచ్చింది. 2017 నవంబర్‌లో కార్యకలాపాలు మొదలయ్యాయి.

అవన్నీ ఊహాగానాలే

పేటీఎం వ్యాలెట్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని జియో ఫైనాన్షియల్ సంస్థ కొనబోతున్నదన్నది ఊహాగానమేనని పేటీఎం కొట్టిపారేసింది. ఈ ప్రచారం నిరాధారమైనదని, సత్యదూరమని అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి ఏ రకమైన లావాదేవీలు జరుగలేదని స్పష్టం చేసింది. పేటీఎం వ్యాలెట్‌ను కొనేందుకు దాని మాతృ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌తో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ చర్చలు జరుపుతున్నదని సోమవారం వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంగళవారం ఇవన్నీ వదంతులేనని పేటీఎం వెల్లడించింది. మరోవైపు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా అలాంటిదేమీ లేదని సోమవారం రాత్రి పొద్దుపోయాక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)కి సమాచారమిచ్చింది. ఈ వ్యవహారంపై బీఎస్ఈ వివరణ కోరడంతోనే పైవిధంగా జియో ఫైనాన్షియల్ స్పందించింది. అయితే ఈ ఊహాగానాల మధ్య సోమవారం ట్రేడింగ్‌లో జియో ఫైనాన్షియల్ షేర్ విలువ 14 శాతం పుంజుకొని రూ.289 వద్ద ముగిసింది. ఇక ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో పేటీఎం మార్కెట్ విలువ రూ.20,000 కోట్లకుపైగా(దాదాపు 43 శాతం) హరించుకుపోయింది.

మాట్లాడుతున్నాం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రస్తుత పరిణామాలపై పేటీఎంతో మాట్లాడుతున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేమెంట్స్ విభాగం దేశీయ అధిపతి పరాగ్ రావు తెలిపారు. చాలా ఏండ్లుగా పేటీఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కలిసి పేమెంట్స్ ఎకోసిస్టమ్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రావు పైవిధంగా చెప్పుకొచ్చారు. అయితే ఏం జరుగుతున్నదన్నది లోతుగా తమకు తెలియదన్న ఆయన వేచిచూసే ధోరణినే అవలంభిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఇదిలావుంటే సోమవారం జియో ఫైనాన్షియల్‌తోపాటు పేటీఎం వ్యాలెట్‌ను కొనుగోలు చేసే రేసులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా ఉన్నట్టు వార్తలు వచ్చినట్టు తెలిసిందే.

రంగంలోకి ఈడీ, ఎఫ్ఐయూ?

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) ఆరా తీస్తున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈ క్రమంలోనే ఆర్బీఐ నుంచి దాని నివేదికను కోరినట్టు మంగళవారం తెలియవచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఉల్లంఘనలు ఏమైనా జరిగాయా? అన్న కోణంలో ఈడీ, ఎఫ్ఐయూలు చూస్తున్నాయి. అయితే తాము ఏ తప్పూ చేయలేదని చెప్తున్న పేటీఎం.. తమపై ఏ రకమైన దర్యాప్తులూ జరగడం లేదని సోమవారం స్పష్టం చేసినది తెలిసిందే. కానీ మంగళవారం ఈ ఇష్యూపై ఈడీ, ఎఫ్ఐయూలు ఆరా తీస్తున్నట్టు రావడం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నది.

వైట్-కాలర్ జాబ్స్ డౌన్

జనవరిలో 11 శాతం తగ్గిన రిక్రూట్‌మెంట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశవ్యాప్తంగా వైట్-కాలర్ ఉద్యోగ నియామకాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది తొలి నెలలో ఈ నియామకాలు 11 శాతం తగ్గినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఏడాది ప్రాతిపదికన జనవరి నెలలో ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు 19 శాతం తగ్గినట్లు, అయినప్పటికీ హెల్త్ కేర్, ఆతిథ్య, ఎఫ్ఎంసీజీ రంగాల్లో మాత్రం పెరిగినట్లు నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడించింది. నెలవారీ జాబితాలో భాగంగా గత నెలకుగాను విడుదల చేసిన నివేదికలో కృత్రిమ మేధస్సుకు సంబంధించి మెషిన్ లెర్నింగ్ ఇంజినీరింగ్, ఏఐ సైంటిస్ట్ ఉద్యోగ నియామకాలు 46 శాతం, 23 శాతం చొప్పున పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన హెల్త్‌కేర్ రంగంలో ఉద్యోగ కల్పన 7 శాతం అధికమవగా, వీరిలో అడ్మినిస్ట్రేటివ్ రోల్ సిబ్బందికి అధిక డిమాండ్ నెలకొన్నదని పేర్కొంది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగం అంచనాలకుమించి దూసుకుపోతుండటంతో ఈ రంగంలో ఉద్యోగ నియామకాలు అంతకంతకు పెరుగుతున్నాయని, ముఖ్యంగా గత నెలలోనూ 5 శాతం పెరిగాయని తెలిపింది. ముఖ్యంగా రెస్టారెంట్ మేనేజర్లు, సర్వీసు మేనేజర్లకు బెంగళూరు, ముంబైలలో డిమాండ్ ఎక్కువగా ఉన్నదని పేర్కొంది. మరోవైపు, బీపీవో రంగంలో నియామకాలు 16 శాతం తగ్గగా, బీమా రంగంలోనూ 8 శాతం తగ్గాయని పేర్కొంది. అలాగే విద్య, రిటైల్ రంగంలో కూడా 7 శాతం చొప్పున తగ్గాయి. ఈ సందర్భంగా నౌకరీ.కామ్ చీఫ్ బిజినెస్ అధికారి పవన్ గోయల్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సుతో కూడిన ఉద్యోగాలు పుంజుకోవడం ఐటీ రంగం పూర్తిగా మార్చివేసిందని, హెల్త్‌కేర్, ఆతిథ్య, ఎఫ్ఎంసీజీ విభాగాల్లో నియామక సెంటిమెంట్ ఆశాజనకంగా ఉన్నదన్నారు.

నిర్మల్‌లో నెక్సా సర్వీసు వర్క్‌షాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ప్రారంభించిన నెక్సా సర్వీసులను మరిన్ని నగరాలకు విస్తరించినట్లు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 100 అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..తొలి దశలో ఒకేసారి ఆరు సెంటర్లను ప్రారంభించింది. వీటిలో నిర్మల్(తెలంగాణ), అటేలి, చర్కిదాద్రి(హర్యానా), బంకురా(బెంగాల్), దాహోద్(గుజరాత్), ఊటీ(తమిళనాడు) ఉన్నాయి. 2017లో ప్రారంభమైన నెక్సా సర్వీసులు ప్రస్తుతం 390 టచ్‌పాయింట్లకు చేరుకున్నాయి.

72 వేల పైకి సెన్సెక్స్

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు కుమ్మరించడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ఉండటం సూచీలకు కలిసొచ్చింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 454.67 పాయింట్లు అందుకొని 72,186.09 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లలో 19 షేర్లు లాభపడగా, 11 షేర్లు నష్టపోయాయి. 157.70 పాయింట్లు పెరిగిన నిఫ్టీ 21,929.40 వద్ద నిలిచింది. దీంతో మదుపరుల సంపద అమాంతం పెరిగింది. మార్కెట్లు ర్యాలీ కొనసాగించడంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4.21 లక్షల కోట్ల సంపదను పోగేసుకున్నారు. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల నికర విలువ రూ.4,21,755.4 కోట్లు పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.3,86,83,2870.93 కోట్లకు చేరుకున్నాయి.

- హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, మారుతి, విప్రో, లార్సెన్ అండ్ టుబ్రో, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్బీఐ, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, పవర్ గ్రిడ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ అత్యధికంగా 3 శాతం పెరగగా, ఐటీ 2.94 శాతం, టెక్ 2.74 శాతం, టెలికమ్యూనికేషన్, ఎనర్జీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, యుటిలిటీస్, పవర్, బ్యాంకింగ్ రంగ సూచీలు నష్టపోయాయి.

కియా సెల్టోస్ రికార్డు బుకింగ్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కొరియాకు చెందిన ఆటోమొబైల్ సంస్థ కియా మరో రికార్డును సొంతం చేసుకున్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎస్‌యూవీ మాడల్ సెల్టోస్‌కు లక్షకు పైగా బుకింగ్‌లు వచ్చాయని సంస్థ ప్రకటించింది. ఎస్‌యూవీ విభాగంలో అత్యధికంగా అమ్ముడవుతున్న మాడల్ కూడా ఇదే కావడం విశేషం. గతేడాది జూలై నెలలో అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని, ప్రతినెలా 13,500కి పైగా బుకింగ్‌లు వచ్చాయని పేర్కొంది. ఆగస్టు 2019లో తొలిసారి విడుదల చేసిన ఈ మాడల్‌ను దేశీయంగా 6 లక్షలకు పైగా యూనిట్లను ఉత్పత్తి చేసింది. వీటిలో 75 శాతం ఇక్కడే విక్రయించింది

నేటి నుంచి మూడు ఐపీవోలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఒకేసారి మూడు సంస్థలు ఐపీవోకి రాబోతున్నాయి. రాశి పెరిఫరల్స్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల పబ్లిక్ ఇష్యూలు బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగియనున్నాయి. ఈ మూడు సంస్థలు కలిసి రూ.1,700 కోట్ల నిధులను సమీకరించబోతున్నాయి. వీటితోపాటు రూ.1,600 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి ఎంటిరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ ఈ నెల 9న ఐపీవోకి రాబోతున్నది. గత నెలలో ఐదు సంస్థలు ప్రైమరీ మార్కెట్ల నుంచి రూ.3,266 కోట్ల నిధులను సమీకరించాయి. 2023లో 58 సంస్థలు నికరంగా రూ.52,637 కోట్ల నిధులను సమీకరించాయి. 2022లో మాత్రం 40 సంస్థలే రూ.59,302 కోట్లను సేకరించాయి. వీటిలో కేవలం ఎల్ఐసీ రూ.20,557 కోట్లను సేకరించింది.

ఆరు బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ వాటా పెంపు

అనుమతిచ్చిన రిజర్వ్ బ్యాంక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీకి రిజర్వ్ బ్యాంక్ శుభవార్తను అందించింది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకులతోపాటు నాలుగు బ్యాంకుల్లో తన వాటాను 9.5 శాతం వరకు పెంచుకునేందుకు సెంట్రల్ బ్యాంక్ మంగళవారం అనుమతినిచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తోపాటు హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతోపాటు ఇతర సంస్థలకు అనుమతినిచ్చింది. యాక్సిస్ బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బంధన్ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల్లో వాటాను 9.5 శాతం వరకు ఫిబ్రవరి 4, 2025 వరకు పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు అయింది.

ఆకట్టుకున్న ఆజాద్ ఇంజినీరింగ్

ముంబై, ఫిబ్రవరి 6: హైదరాబాద్ కేంద్రంగా ఇంజినీరింగ్ సేవలు అందిస్తున్న ఆజాద్ ఇంజినీరింగ్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను కంపెనీ రూ.16.8 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3.83 కోట్లతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 49 శాతం ఎగబాకి రూ.89.23 కోట్లకు చేరుకున్నది. దీంట్లో ఎనర్జీ సెగ్మెంట్ నుంచి 81 శాతం నుంచి సమకూరగా, డిఫెన్స్ నుంచి 17 శాతం లభించిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గత నెలలో స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే.

కిమ్స్‌లో ఎస్బీఐ లైఫ్‌కి వాటా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: హైదరాబాద్ కేంద్రంగా వైద్య సేవలు అందిస్తున్న కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్)లో 1.4 శాతం వాటాను కొనుగోలు చేసింది ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ. రూ.239 కోట్లతో 11.49 లక్షల షేర్లను మంగళవారం బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసింది. సరాసరి షేరు ధర రూ.2,085 కాగా, ఒప్పందం విలువ రూ.239.58 కోట్లు. అలాగే ఐసీఐసీఐ వెంచర్స్‌కు చెందిన ఇండియా అడ్వాంటేజ్ ఫండ్ ఎస్4 కూడా 10.75 లక్షల షేర్లను ఇదే ధరకు హస్తగతం చేసుకున్నది. దీంతో మంగళవారం కంపెనీ షేరు ధర 1.93 శాతం పెరిగి రూ.2,130.40 వద్ద ముగిసింది.

మన ఫార్మాకు మరో దెబ్బ!

ఆంధ్రప్రదేశ్‌లో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు

పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు

హైదరాబాద్ ఫార్మాసిటీపై వీడని సందిగ్ధత

ఇన్వెస్ట్‌మెంట్లు పొరుగు రాష్ట్రానికి తరలివెళ్లే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా, లైఫ్‌సైన్సెస్ హబ్‌గా పేరుగాంచిన హైదరాబాద్ కీర్తి రానున్న రోజుల్లో మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫార్మా, లైఫ్‌సైన్సెస్ పెట్టుబడుల విషయంలో ఇప్పటికే ఉత్తరప్రదేశ్ నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు తాజాగా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా పోటీ మొదలైంది. దీనికితోడు హైదరాబాద్ ఫార్మాసిటీపై రాష్ట్ర ప్రభుత్వం ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నది. దీంతో పలు కంపెనీలు యూపీ, ఏపీలో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి కేంద్రీకరించాయి. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషిచేస్తుంటే.. తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా 'నిమ్మకు నీరెత్తినట్టు' వ్యవహరిస్తున్నది.

అనకాపల్లి జిల్లాలో బల్క్‌డ్రగ్ పార్కు

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు బల్క్‌డ్రగ్ పార్కును మంజూరు చేసిన విషయం విదితమే. దీంతో ఏపీ ప్రభుత్వం రూ.1,235 కోట్లతో అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద 2 వేల ఎకరాల్లో ఈ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈపీసీ విధానంలో ఈ పార్కు నిర్మాణానికి బిడ్లు ఆహ్వానించింది. దీని ద్వారా రూ.14,340 కోట్ల పెట్టుబడులు రాబట్టడంతోపాటు అందులో ఏర్పాటయ్యే 100కుపైగా ఫార్మా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా 27,360 మందికి ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే ఏపీలో 300కుపైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. వీటిలో ఏటా రూ.41,500 కోట్ల విలువైన ఉత్పత్తులు జరుగుతున్నాయి.

ఫార్మా రంగంపై రాష్ట్ర ప్రభుత్వ నిరాసక్తత

ఫార్మా రంగంపై రేవంత్ సర్కారు ఆసక్తి చూపకపోవడంతో ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన 70కిపైగా ఔషధ కంపెనీలు యూపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. దీనికితోడు ఏపీలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటైతే మన రాష్ట్రంలో ఫార్మా రంగానికి గడ్డు పరిస్థితి తప్పదన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఏపీకి ఓడరేవులు కూడా ఉండటం ఆ రాష్ట్రానికి సానుకూల అంశమని పరిశ్రమ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఔషధ రంగానికి బలమైన ఎకోసిస్టం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే సహాయ సహకారాలపై సందిగ్ధత నెలకొనడంతో పలు ఫార్మా కంపెనీలు ప్రత్యామ్నాయాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి.

ఎటూ తేల్చని రేవంత్ సర్కారు

హైదరాబాద్‌లో ఫార్మాసిటీ ఏర్పాటుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎటూ తేల్చడంలేదు. హైదరాబాద్ శివార్లలో సుమారు 16 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించిన గత ప్రభుత్వం.. అందులో ఇప్పటికే 13 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించాలని అనేక ఫార్మా కంపెనీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి కేటీఆర్ దావోస్, అమెరికా, లండన్‌లో పర్యటించినప్పుడు తెలంగాణలో ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంతోపాటు ప్రభుత్వంతో ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. దీంతో హైదరాబాద్ ఫార్మాసిటీలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మౌలిక సదుపాయాలను, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫార్మాసిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గత ప్రభుత్వమే కేంద్రానికి డీపీఆర్‌లు కూడా సమర్పించింది.

అంతా గందరగోళమే

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టగానే ఫార్మాసిటీని రద్దుచేస్తున్నట్టు ప్రకటించింది. దానికి బదులుగా ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కొత్త ప్రతిపాదన సమర్పిస్తామని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను పక్కన పెట్టాలని కోరారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తారా? లేక ప్రభుత్వ పెద్దల మదిలో మరేదైనా ఆలోచన ఉన్నదా? అనేది స్పష్టమవడంలేదు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. బహుళజాతి కంపెనీల వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదని సెలవిచ్చారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ప్రోత్సహించేందుకు త్వరలో కొత్త పాలసీని తీసుకొస్తామని చెప్పారు. దీంతో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్న కంపెనీలన్నీ పునరాలోచనలో పడ్డాయి. ఫలితంగా రాష్ట్రంలో ఫార్మా రంగం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

ఆరోగ్య బీమా మరింత చౌక!

జీఎస్టీ తగ్గింపునకు పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆరోగ్య బీమా, మైక్రోఇన్సూరెన్స్‌పై పన్ను భారం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక వ్యవహారాలపై ఎంపీ జయంత్ సిన్హా నేతృత్వంలో ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ.. హెల్త్ ఇన్సూరెన్స్, మైక్రోఇన్సూరెన్స్‌లపై ప్రస్తుతం పడుతున్న పన్ను, సేవల పన్ను (జీఎస్టీ)ను 18 శాతం దిగువకు చేర్చాలని సిఫార్సు చేసింది. సీనియర్ సిటిజన్ల కోసం ఆరోగ్య బీమా, మైక్రోఇన్సూరెన్స్ ఉత్పత్తులపై జీఎస్టీకి కోత పెట్టాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. 'బీమా పాలసీలపై ముఖ్యంగా ఆరోగ్య, టర్మ్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్స్‌పై జీఎస్టీ రేటును హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నదని కమిటీ భావించింది. ప్రస్తుతం వీటిపై 18 శాతం పన్ను పడుతున్నది. అధిక జీఎస్టీ రేటుతో అధిక ప్రీమియంల భారాన్ని మోయాల్సి వస్తున్నది. దీని వల్ల బీమా పాలసీలకు కొందరు దూరం అవుతున్నారు' అని 'బీమా రంగ నియంత్రణ, పనితీరు సమీక్ష'పై ఇచ్చిన నివేదికలో పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొన్నది. బీమాను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, అందుకే ఆరోగ్య బీమా ఉత్పత్తులపై వర్తిస్తున్న జీఎస్టీ రేట్లను, ముఖ్యంగా వృద్ధుల కోసం రిటైల్ పాలసీలపై, మైక్రోఇన్సూరెన్స్-టర్మ్ పాలసీలపై పన్ను భారాన్ని తగ్గించాలన్నది.

ప్రభుత్వ బీమా సంస్థలపై..

ప్రభుత్వ రంగానికి చెందిన నాలుగు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ఆర్థిక పరిస్థితులు బాగా లేవని, వాటిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని కమిటీ ఈ సందర్భంగా చెప్పింది. ఆయా సంస్థలు మూలధన కొరతను ఎదుర్కొంటున్నాయన్నది. దివాలా ముప్పు పొంచి ఉన్నట్టు తెలిపింది. 2016-17 నుంచి 2020-21 వరకు ఐదేండ్లలో రూ.26,000 కోట్ల నష్టాలను చూసినట్టు వివరించింది. దీంతో ఈ నష్టాల ఊబిలో నుంచి కంపెనీలను బయటపడేసేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలనూ పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది.

మైక్రోఇన్సూరెన్స్‌పై..

సమాజంలో ఆరోగ్య, జీవిత, పంటలు తదితర అంశాలకు సంబంధించి ఇబ్బందులు పడుతున్న పేద, అల్పాదాయ వర్గాల భద్రత, ఆర్థిక రక్షణ కోసం మరిన్ని కొత్త మైక్రోఇన్సూరెన్స్ ఉత్పత్తులను తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఇందుకు రూ.100 కోట్ల మూలధన నిల్వల అవసరం ఉండొచ్చని అంచనా వేసింది.

మోటర్ ఇన్సూరెన్స్‌పై..

మోటర్ ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యతనిచ్చేలా ఆర్థిక సంస్థలు తమ రుణాల మంజూరు సమయంలో నిర్ణయాలు తీసుకోవాలని కమిటీ సూచించింది. ఈ మేరకు